క్లుప్తంగా

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



కళాజాతను ప్రదర్శిస్తున్న కళాకారులు

అద్దంకి: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వాహిలా చౌదరి అన్నారు. జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం పట్టణంలోని భవానీ సెంటర్‌లో నిర్వహించారు. కళాజాతలో హెచ్‌ఐవీ ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులు ఎలా వస్తాయి.. రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని కళ్లకు కట్టినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్, ఎంఈపీడీ భార్గవ్, ఏఎన్‌ఎం కే రథమ్మ, ఏఆర్ డబ్ల్యూ వీ కరుణ, టీ శ్రావణి, పీలు డీ పార్వతి, సంధ్య, సీహెచ్ శివపార్వతి, మల్లీశ్వరి, కళాజాత నాగరాజు, బృందం, సీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లులో రోటరీ ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లులో రోటరీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ రోటరీ 119 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రోటరీ గంగ భవనంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యుడు మద్దినేని హనుమంతరావు పాల్ హారీస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రోటరీ సంస్థ పోలియో నివారణలో ప్రముఖ పాత్ర వహించిందని వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు, కార్యదర్శి జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి) కోశాధికారి చుండి సాంబశివరావు, సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం మదనగోపాలుడి కల్యాణం



చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న రుక్మిణి సత్యభామా సమేత మదనగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఖానసాగమన ప్రకారంగా త్రయాహ్నిక దీక్షతో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కళ్యాణాన్ని యాజ్ఞికులు తమిరిశ వంశీకృష్ణ నిర్వహించారు. శనివారం ఉదయం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆర్వీ రంగాచార్యులు నిర్వహించగా ఆలయ 14వ ధర్మకర్తలు జక్కా రమేష్, డాక్టర్ జక్కా మోహనమురళీ ధరరావులు హాజరయ్యారు. కార్యక్రమాలను ఆలయ మేనేజర్ టీవీ శివనాగదాసు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

ఘనంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం శాంతి కల్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌కు, రాజ్యలక్ష్మీ అమ్మవారికి అర్చకుల బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేద మంత్రాల మధ్య కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులు అన్నసంతర్పణ చేశారు. ఆలయ ఈవో జీ.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కేశవరావు, ధర్మకర్తలు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మార్చి 1న చెన్నకేశవస్వామి ఆలయంలో వేలం

మార్కాపురం టౌన్: శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థాన పరిధిలో తలనీలాలు పోగుచేసుకునే హక్కుకు మార్చి 1వ తేదీ ఉదయం 10 గంటలకు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ జి.శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మే 1 నుంచి 2025 ఏప్రిల్ 30వ తేదీ వరకు హక్కు ఉంటుందని, టెండర్ కమ్ బహిరంగ వేలంలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

సాంకేతిక విద్య.. భవిష్యత్‌కు బాట

- విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్యాబ్‌లు
- సంతోషం వ్యక్తం చేస్తున్న చిన్నారులు, తల్లిదండ్రులు



ప్రభుత్వం అందించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

వేటపాలెం: చదువుతోనే పేదరికం దూరమవుతందని గట్టిగా నమ్మిన వ్యక్తి సీఎం సీఎం జగన్ మోహన్‌రెడ్డి. మనం వారికి ఇచ్చే ఆస్తి ఒక్క చదువేనని బహిరంగ సభల్లో ఉటంకిస్తూనే ఉంటాడు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులు ఉన్నతంగా రాణించాలనే సంకల్పంతో ముందడుగు వేస్తోంది ప్రభుత్వం. పోటీ ప్రపంచంలో మేటిగా నిలబడి, కార్పొరేట్ స్కూళ్లను అధిగమించేలా మార్కులు సాధించాలి. విజ్ఞాన సముపార్జనలో ముందడుగు వేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. అందులో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్యాబ్‌లను అందించారు. వాటిలో బైజూస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి ఎంతో విలువైన కంటెంట్‌తో పిల్లలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వం చిత్తశుద్ధిపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వేటపాలెం మండలంలో 19 గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాల్లో మొత్తం 624 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. విద్యార్థులు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను ఉపయోగించుకుంటూ సాంకేతిక విద్యను అందిపుచ్చుకుంటున్నారు.

సులభంగా నేర్చుకుంటున్నాం ..



మాకిచ్చిన ట్యాబ్‌లతో ఎన్నో కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం. బైజూస్ యాప్ ద్వారా పాఠ్యాంశాలు అవగాహన చేసుకోవడం ఎంతో సులభంగా మారింది. చిన్నప్పటి నుంచి సాంకేతికతపై పట్టు సాధించేందుకు సహకరిస్తున్న ప్రభుత్వానికి థ్యాంక్స్.

– ఆవుల సాత్విక, 8వ తరగతి, చల్లారెడ్డిపాలెం

జగన్ మామయ్య గ్రేట్..



ముఖ్యమంత్రి జగన్ మామయ్య మాకు యూనిఫారం, పుస్తకాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకునేందుకు ట్యాబ్‌లు ఇచ్చారు. ట్యాబ్‌లో ఇచ్చిన బైజూస్ కంటెంట్‌తో ఎప్పటికప్పుడు పాఠ్యాంశాలను అవగాహన చేసుకుంటున్నాం. మాకు మంచి సౌకర్యాలు కల్పిస్తున్నారు.

– పులి సుప్రియ, 8వ తరగతి, అక్కాయిపాలెం

జగన్ మామయ్య సహకారం మరువలేం..



పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను ఇంటికి వెళ్లాక ట్యాబ్‌ల ద్వారా మళ్లీ చూసుకుంటున్నాం. యాప్ ద్వారా ఎంతో సులభంగా పాఠ్యాంశాలపై పట్టు లభిస్తుంది. ముఖ్యమంత్రి అందిస్తున్న సహకారం మరవలేం.

–చుక్కా మణికంఠ, 8వ తరగతి, అక్కాయిపాలెం

అందుబాటులో డిజిటల్ విద్య..



ప్రైవేటు పాఠశాల్లో మాత్రమే లభించే డిజిటల్ విద్య జగనన్న ఇచ్చిన ట్యాబ్‌ల ద్వారా మాకు అదుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, బైజూస్ యాప్ ద్వారా పాఠ్యాంశాలు నేర్పించడంతో ఉన్నత శిఖరాలు, అధిరోహించేందకు మాకు మార్గం సులువవుతుంది.

– పీ దేవచంద్, 8వ తరగతి విద్యార్థి, కొత్తపాలెం

వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులు



హనిమిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న రమణబాబు

మేదరమెట్ల: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేపడుతున్న పలు సంక్షేమ పథకాలకు రాష్ట్రాభివృద్ధికి ఆకర్షితులైన పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీ లోకి చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందులో భాగంగానే కొరిశపాడు మాజీ వార్డు మెంబర్ గోలి రమణబాబు తన అనుచరులతో కలసి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ ఉన్నతి కోసం అద్దంకిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసేందుకు తమ వంతు కృషి చేస్తానని రమణబాబు తెలిపారు. వీరి వెంట మండల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి తమలపాకుల పూజ



అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి పౌర్ణమి సందర్భంగా శనివారం లక్ష తమల పాకులతో పూజ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. దేవస్థాన పండితులు, ఉభయదాతలు మేళతాళలతో దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేసి ధ్వజస్తంభం వద్ద పూజలు చేశారు. అనంతరం స్వామివారికి 11 ఆవృత్తాలుగా ఆకుపూజ చేశారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితం

పుల్లలచెరువు: ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్య అందించేందుకు 25 శాతం సీట్లు విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచితంగా ఇవ్వనున్నట్లు ఎంఈవో శామ్యూల్ జాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో స్టేట్ సిలబస్ అమలవుతున్న పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఒకటో తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉందన్నారు. అనాథ, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4శాతం, బీసీ వర్గాలకు చెందిన మైనార్టీలకు, ఓసీ గ్రామీణ ప్రాంత కుటుంబాలకు ఏడాదికి రూ.1.20 లక్షల ఆదాయం లోబడి ఉన్న వారికి 6 శాతం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఐదేళ్లు నిండి అర్హులైన వారు ప్రస్తుత చిరునామా, ఆధార్, ఓటర్, రేషన్ కార్డు, జనన ధ్రువపత్రం, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అభివృద్ధి బాటలో గ్రామీణ రోడ్లు



అభివృద్ధి చేస్తున్న కొమ్మినేనివారిపాలెం రోడ్డు



ఎర్రమట్టి తోలిన దృశ్యం

11 కిలోమీటర్లకు రూ. 2.3 కోట్ల నిధులు

బల్లికురవ: గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని రోడ్లు ఇప్పుడు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయి. బల్లికురవ, కొమ్మినేనివారిపాలెం, పంగులూరు ఆర్ అండ్‌బీ లింకురోడ్డు పనులు చురుగా జరుగుతున్నాయి. అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి కృషితో నేడు రోడ్లు బాగుపడుతున్నాయి. పంగులూరు, కోటపాడు, కొండమంజూలూరు, వల్లాపల్లి క్రాస్ రోడ్డు, కొమ్మినేనివారిపాలెం–వైదన, చవిటిమాదిగపల్లి వరకు 11 కిలోమీటర్లు గోతులతో అధ్వాన స్థితికి చేరింది. నేడు చిల్లచెట్లు తొలగింపుతో రోడ్డు చదును చేసి బాగుచేస్తున్నారు. తదుపరి బీటీ రోడ్డుగా మార్చనున్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ నరసింహారావు, జేఈ శివన్నారాయణ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచని లింకు రోడ్డు ఇప్పుడు బాగుపడటంతో వాహనదారులు, ప్రజలు సంతోషం వక్తం చేస్తున్నారు. పంగులూరు, మార్టూరు, అద్దంకి, బలికురవ మండలాల్లోని 70 గ్రామాల ప్రజలు ఈలింక్ రోడ్డు ద్వారా మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్‌హదారిలోని వైదన క్రాస్ రోడ్డు నుంచి చెన్నై, విజయవాడ జాతీయ రహదారిలోని బొల్లాపల్లి టోల్‌గేట్ వద్దకు వెళ్లేందుకు ఉపయోగపడుతుంది. దీంతో పలు గ్రామాల ప్రజలు రోడ్డు అభివృద్ధి పరుస్తున్నందుకు హనిమిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఎర్రా ప్రగడ గ్రంథావిష్కరణ

ఒంగోలు మెట్రో: ప్రబంధ యుగకర్త ఎర్రా ప్రగడ గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం పది గంటలకు ఒంగోలులోని రంగారాయుడు చెరువు వద్ద గల బ్రాహ్మణ సేవా సమితి కమ్యూనిటీ హాలులో నిర్వహించనున్నట్లు పద్య సారస్వత పరిషత్ జిల్లా శాఖ అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి, సంస్థ ప్రధాన కార్యదర్శి పింగళి పూర్ణచంద్రరావు తెలిపారు. పద్య సారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షుడు, బహు గ్రంథకర్త, ప్రముఖ మహా కవి, ఎర్రన వంశీయులు చదలవాడ లక్ష్మీనరసింహారావు పరిశోధనాత్మక దృష్టితో జీవిత కాలపు తపస్సుగా భావించి శ్రమించి రచించిన గ్రంథావిష్కరణ సభకు మాగంటి శ్రీరామమూర్తి అధ్యక్షత వహిస్తారన్నారు. సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు పెద్ద సంఖ్యలో హాజరై గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

అధికారుల నిర్లక్ష్యంతో ఆదాయానికి గండి



చెరువు నీటిని పొలాలకు వాడుకుంటున్న దృశ్యం

పర్చూరు (చినగంజాం): నీటి చౌర్యంతో ఉప్పుటూరు పంచాయతీకి రావాల్సిన ఆదాయనికి తీవ్రంగా గండి పడుతోంది. నీటి చౌర్యాన్ని అడ్డుకోవాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోకుండా మిన్నకుండి పోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది. గ్రామానికి పడమర వైపును ఉన్న చెరువులో నీటిని కొందరు నాయకులు పొలాలకు వాడుకుంటున్నారు. గడచిన 20 రోజులుగా గ్రామంలో నీటి చౌర్యం జరుగుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని తూర్పు చెరువులో ఉన్న నీటిని అమ్ముకునేందుకు ఇటీవల కొందరు ప్రయత్నాలు సైతం చేశారు. నీటిని మళ్లించుకునే విషయంలో వారి మధ్య సయోధ్య కుదరక పోవడం విషయం పోలీసుల వరకు పోవడం ప్రయత్నాలు విరమించుకున్నారు. గ్రామంలో ఉన్న వాటర్ ప్లాంట్ పరిస్థితి కూడా అధ్వానంగా తయారయింది. ప్లాంట్ ద్వారా పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి కూడా గండి పడింది. ఈ విషయమై సాక్షి గ్రామ కార్యదర్శి సుబ్బారావును వివరణ కోరగా పంచాయతీ పరిధిలో నీటి చౌర్యం జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సభ్యులు నోటీసులు జారీ చేసి సమావేశాన్ని ఏర్పాటు చేసి గ్రామంలోని అన్ని సమస్యలను చక్కదిద్దుతామని చెప్పారు.

మాఘ పౌర్ణమి సందర్భంగా శ్రీగిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మహిళలు

ఒంగోలు మెట్రో: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఒంగోలు నగరంలోని కొండమీద శ్రీగిరి ప్రదక్షిణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని గిరి ప్రదక్షిణ చేశారు. శ్రీగిరి పాదపీఠం వద్ద బాపూజీ గో సంఘం వద్ద నుంచి సుందరంగా అలంకరించిన రథంపై గంగా పార్వతీ సమేత శివయ్య ఉత్సవ మూర్తులను అదిష్టింపజేసి భక్తులు స్వామివారి నామాలను స్మరిస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. స్థానిక కోర్టు సెంటర్, గ్రంథాలయం, పొట్టి శ్రీరాములు విగ్రహం, కేశవస్వామిపేట దేవాలయాలు, భగీరథ మహర్షి విగ్రహం, వేప అంకమ్మ తల్లి, లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం, ఆంజనేయ దేవస్థానం, లక్ష్మీ గణపతి దేవస్థానాలను చుట్టి గోశాల ముందుగా శ్రీగిరి చేరారు. అనంతరం స్కందగిరి శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం వద్ద గిరి ప్రదక్షిణ ముగించారు. గరుత్మంతుడు, హనుమంతుడు, శంకు చక్ర నామాలను చేత పట్టి దీప జ్యోతిని తలపై పెట్టుకుని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక గిరిప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా శివలింగ ప్రతిష్ట మహోత్సవం



చెన్నుపల్లి చెరువు సమీపంలో ప్రతిష్టించిన శివలింగం

బల్లికురవ: మండలంలోని చెన్నుపల్లి గ్రామ సమీపంలోని పంట చెరువు వద్ద శనివారం ఉదయం 10.16 గంటలకు మృత్యుంజయ మహాదేవ, శివ లింగ వాయుప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. కొండాయపాలెం గ్రామంలోని గంగాపార్వతీ సమేత నీల కంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త ధూళిపాళ్ల రామగోవింద శివకుమారి దంపతులు ఆధ్వర్యంలో సుమారు రూ.15 లక్షల ఖర్చుతో శివలింగాన్ని ప్రతిష్టించారు. ప్రతిష్ట చార్యులు కారెంచేటి పిచ్చయ్య శాస్త్రి బృందంచే గురువారం వేడుకలకు అంకురార్పణ చేశారు. శుక్రవారం హోమాలు, జలాధి, ధాన్యాధి, శయ్యాధి వాసాల తదపరి శనివారం ప్రతిష్ట, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఈ వేడుకల్లో బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకలు ముగింపులో భాగంగా అన్నసంతర్పణ చేపట్టారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

బల్లికురవ: గొర్రెలు మేపుకునేందుకు భార్యభర్త ఇంటికి తాళం వేసి వెళ్లగా విద్యుదాఘాతంతో పూరిల్లు, గొర్రెల పాక, అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటన శనివారం బల్లికురవ మండలంలోని పాత మల్లాయపాలెంలో జరిగింది. గ్రామస్తులు, బాధితుల వివరాల మేరకు.. గ్రామ ఎస్సీకాలనీ సమీపంలో ఉయ్యాల కోటేశ్వరరావు ఒక పాకలో గొర్రెలు, మరో పాకలో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. శనివారం గొర్రెలు మేపేందుకు భార్య దుర్గతో కలిసి పొలం వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఒక్కసారి ఇంట్లో నుంచి మంటలు వచ్చాయి. వీఆర్‌వో రత్నంరాజు, డిజిటల్ అసిస్టెంట్ సతీష్, గ్రామస్తులు మంటలు పరిసర గృహాలకు వ్యాపించకుండా నీటి ట్యాంకర్‌తో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈఘటనలో నివాస గృహంతోపాటు గొర్రెల పాక పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. కట్టుబట్టల మినహా సుమారు నాలుగు లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. బీరువాలో ఉంచిన ఐదు సవర్ల బంగారం, రూ. 30 వేల రూపాయల నగదు, గృహోపకరణలు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న వెంటనే మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డీ. బ్రహ్మరెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా సాయం అందేందుకు కృషి చేస్తానని చెప్పారు. తక్షణ సాయంగా ఆర్థిక సాయం అందించారు. ఈపరామర్శలో వల్లాపల్లి సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి స్థానిక నేతలు ముద్దపాటి శంకర్, బండి గంగాప్రసాద్, కొణదుల శంకర్‌రెడ్డి, మద్దినేని అశోక్, పావలూరి చందు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి ప్రయాణికులు సహకరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎం శ్యామల

ఇంకొల్లు (చినగంజాం): ఆర్టీసీ అభివృద్ధికి ప్రయాణికుల సహకారం అవసరమని చీరాల ఆర్టీసీ డిపో మేనేజర్ శ్యామల అన్నారు. శనివారం ఆమె ఇంకొల్లు ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను ఆమె పరిశీలించారు. బస్‌ స్టేషన్‌లో ఆమె సిబ్బంది కేఎంపీఎల్ పుస్తకాలు, ఆదాయ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆక్యుపెన్సీని పెంచాలని అభివృద్ధికి సహకరించాలని ఆమె సిబ్బందిని కోరారు. దాతల సహకారంతో ఇంకొల్లు బస్టాండు ఆవరణలో నిర్మించనున్న మదర్ ఫీడింగ్ రూం షెడ్డు నిర్మాణం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకొల్లు నుంచి గొల్లపాలెం మీదుగా తిమ్మసముద్రం బస్సులు వేయాలని ప్రయాణికులు కోరారు. కార్యక్రమంలో కంట్రోలర్ బాబు, మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు ఏ మోహన్‌కృష్ణ పలువురు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సంఘ అభివృద్ధి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రింటింగ్ ప్రెస్‌ల నిర్వాహకులు

చీరాల అర్బన్: ప్రింటింగ్ రంగానికి అందరూ ఐక్యతతో ఉండాలని, ఐక్యతతోనే సంఘ అభివృద్ధి చెందుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ముద్రణా యంత్రాలను కనుగొన్న పితామహుడు జోహెన్నెస్ గూటన్ బర్గ్ జయంతి (ప్రింటర్స్ డే) వేడుకలను శనివారం పట్టణంలోని ప్రింటింగ్, డీటీపీ, బైండర్స్, ఫ్లెక్స్ ప్రింటింగ్ కేంద్రాల నిర్వాహకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత టెలిగ్రాఫ్ ఆఫీస్ వద్ద ప్రింటర్స్ డే జెండా ఆవిష్కరించారు. జోహెన్నెస్ గూటన్ బర్గ్ చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోటరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సభలో పలువురు మాట్లాడుతూ ముద్రణారంగంలో పనిచేసేవారంతా సన్నకారులేనని, అసోసియేషన్ ద్వారా ముద్రణారంగంలో పనిచేసే వారు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అలానే డీటీపీ ఆపరేటర్లు కూడా తక్కువగా ఉన్నారని, యజమానులే కంప్యూటర్ పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నక్కల శ్రీనివాసరావు, సెక్రటరీగా ఎస్.అరవింద్, కోశాధికారిగా కె.నాగేశ్వరరావులతో పాటు సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ముద్రణారంగంలో ఎంతో కాలంగా సేవలందిస్తున్న మోహనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీ ప్రింటింగ్ యూనిట్‌ల నిర్వాహకులు, డీటీపీ ఆపరేటర్లు, బైండర్లు పాల్గొన్నారు.

ప్రతిభామూర్తులు చిరస్మరణీయులు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అద్దంకి: ప్రతిభామూర్తులు చిరస్మరనీయులని జాషువా కళాసమితి అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య అన్నారు. స్థానిక కేర్ అండ్ క్యూర్ హోమియో వైద్యశాలలో శనివారం రాత్రి ఆనలుగురు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభామూర్తుల కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యశాలలో శనివారం రాత్రి ప్రతిభమూర్తులకు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సినిమా హాస్య నటుడు పద్మనాభం, రావికొండలరావు, రంగస్థల నటుడు షణ్ముఖి ఆంజనేయరాజు గురించి పీసీహెచ్ కోటయ్య, రంగస్థల నటుడు సాయి నాట్యకళాసమితి అధ్యక్షుడు అద్దంకి శ్రీనివాసరావు ప్రసంగించారు. ఈసందర్భంగా కోటయ్య మాట్లాడుతూ రావి కొండలరావు 600 సినిమాల్లో నటించాడని చెప్పారు. ఆయన నటన అజరామరమన్నారు. తరువాత హరిశ్చంద్ర పద్యాలతో సభికులను మంత్రముగ్దులను చేశారు. తరువాత లక్కరాజు శ్రీనివాసరావు ప్రసంగించారు. కార్యక్రమంలో తొలుత ప్రతిభామూర్తుల చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు తదితరులు పాల్గొన్నారు.